# తమస్సు

"తమస్త్వజ్ఞానజం విద్ధి'' తమోగుణం యెక్కువ కాగానే అజ్ఞానం పుట్టుతుంది అన్నారు, అజ్ఞానాన్ని చీకటితో పోల్చారు, దశకంఠుడు అనగా, ఇంద్రియాలను గుఱ్ఱాలతో పోల్చారు గనక, వాటిని అదుపుచేయక, వాటిని నెత్తినెక్కించుకుని తిరిగిన వాడు అని అర్థం, దశరథుడు అనగా పది యింద్రియాలనూ, లోబరచుకుని, తను చెప్పినట్టు అవి నడిచేట్టు చేసి, జీవితమనే రథమును నడిపించినవాడూ అని అర్థం, రాముడు పోరాడింది అజ్ఞానంతోనే, అందుకే ఆదిత్యుని ఆరాధించగానే, వెల్తురు వచ్చి చీకటిని పటాపంచలు చేసింది. దశకంఠుడు నేల గూలాడు. 'తిమిరంతో సమరం' అని ఒక ఆధునిక కవి, కవనం అల్లాడు. అజ్ఞానంతో పోరాటం అంత తేలిక గాదు అని రామ రావణ యుద్ధం చెప్తుంది. అజ్ఞాని అయిన రావణుడు, రాజ్యము, బలగము, ప్రాణాలు కోల్పోయాడు. రాముడు వనవాసం పూర్తి చేసుకుని, విజేత అయి, భార్యతో వెళ్ళి, రాజ్యాభిషిక్తుడయినాడు. అదీ తేడా, ఇలా చెప్తున్నాడు శాస్త్రి.

అందరూ లేచారు, తెచ్చినవి రాముని పటం ముందుంచి దణ్ణం పెట్టి వెళ్ళిపోతున్నారు. ఓబయ్యవచ్చి అడిగాడు.

"జ్ఞానో, అజ్ఞానో యెలా తెలుసుకోటం?

శాస్త్రి ఓబయ్యను చూసి, రామాయణం మూసి సంచీలో పెడ్తూ విశదీకరించాడు.

అజ్ఞాని మనుషులు బతికుండగా యేడిపించి, వారు దివికేగగానే కర్మకాండలు చేసి, అపర కర్మలలో ఆసక్తి చూపుతాడు, చనిపోయినవారి పటాలని పూజిస్తే, పూజ పోయిన వారికి అందుతుందని, తద్దినాలూ, అపరకర్మలూ సద్గతులు కలిగిస్తాయనీ, బతికున్న వారికి బోధిస్తాడదో పెద్ద గుర్తు."

ఓబయ్య మరోప్రశ్న వేయబోయాడు.

"పండితపుత్రా! ఓబయ్యా! నీకుశ్శంకలకు సమాధానాలు రేపిస్తాలే. నే బోయి ట్యూషన్ చెప్పుకుని నాలుగురాళ్ళు సంపాయించుకోవాలి." లేని వెళ్ళిపోయినాడు శాస్త్రి.

## 2

ఓబయ్య మొదటి అన్న కొడుక్కి ట్యూషన్ ఒప్పుకుని, పాఠం చెపుతున్నాడు శాస్త్రి.

'పసగలుగు యువతులుండగ, పసిబాలల బొందువాడు పసరము సుమతీ?' పసరము అంటే పశువు. పశువుకి యిది తగునా తగదా అనే ఆలోచనరాదు. రోడ్డుమీద పోతూనే పేడ వేస్తుంది. పంచిదం వదుల్తూ వెల్తుంది. సిగ్గుగూడా వుండదు. సాటి పశువులకు వెరవదు. కోపమొస్తే తనకన్న చిన్న పశువునూ కుమ్మేస్తుంది అలాగే" అంటుండగా. ఓబయ్య వ్డదవడటంచూసి వాడువుగా తప్పుకుని దూరంగా నించున్నాడు శాస్త్రి. ఓబయ్య దగ్గరగావచ్చి, గుడ్లురిమి దబాయించాడు, అతని రెండు గుప్పిళ్ళూ చూశాము శాస్త్రి.

"అదేం పాఠం? అదెవడు చెప్పమన్నాడు?"

"యేమో మీ అన్న చెప్పమన్నాడు. సుమతీ శతకము కొన్నది గూడా ఆయనే. నిన్నుడికించటానికి నేనీ పుస్తకంకొని తెచ్చి చేప్తున్నానంటావా? అయినా నీకు ఆవేశమెందుకొస్తుందీ నిన్ను గురించి చెప్తున్నట్టు ఊహిస్తావేం? గుమ్మడి కాయల దొంగెవర్ంటేబుజాలు తడుముకున్నాడుట. తగ్గ తగు పండిత

పుత్రా!" శాస్త్రి నవ్వు చూస్తుంటే, ఆ పిలుపు వింటుంటే చావ గొట్టి చెవులు మెలియ్యాలనిపించింది ఓబయ్యకి. ఆచరణలో పెట్ట బోయాడు. శాస్త్రి మెరుపులాగా పక్కకి తప్పుకున్నాడు. ఆ వూపుకి ఓబయ్య గోడకి కొట్టుకున్నాడు. బొప్పికట్టింది. అయినా సరే, శాస్త్రినె చూస్తూ ఖరాఖండిగా అన్నాడు.

"మళ్ళా ఆ పద్యం అర్థం చెపుతుంటగా విన్నానా నీ మక్కెలు విరగదంతా, ఖబాడోర్!'

'ఇప్పుడు తన్నావుగా చాలదూ. పోనీచేప్పనులే. ఉన్మా దం తగ్గించుకో ఓబయ్యా! తల అదురుతున్నది నీకు నవ్వాడు శాస్త్రి. నన్ను యెట్లా తిట్టాలో గూడా తెలియదు నీకు.

ఓబయ్య వెళ్ళాక శిష్యుడు గురువు చెయ్యి పట్టుకున్నాడు "రండి మాష్టారూ! మా బాబాయి యెప్పుడూ అంతే మా అక్క తన స్నేహితురాలి హార్మనీ తెచ్చుకుని వాయిస్తుంటే, 'యిటుతే నువ్వడ్డంతే' అని లాక్కున్నాడు. యెంతకీ యివ్వలేదు. నాది కాదు ఇచ్చేయ్ బాబాయి! అని యేడిస్తే నాలుగు తన్నాడు. నాన్న వచ్చి హార్మనీ యిప్పించి అక్క యేడుపుమాన్పించాడు మంచి హార్మనీ కొనిబెడతానన్నాడు నాన్న. వాళ్ళది వాళ్ళకి చ్చేయమన్నాడు నాన్న" అన్నాడు.

అంత చిన్న పిల్లాడికి ఒబయ్య తత్త్వం అర్థమైంది.

హార్మనీ కొనక్కరలేదని మీ నాన్నతో చెప్పు గోపీ. మా యింట్లో హార్మనీ వున్నది. మీ సుగుణక్కకి నెతెచ్చిస్తానని చెప్పు

## 3

మునసబుగారబ్బాయికి పదోయేడు. అయిదోక్లాసు చదు తున్నాడు. శాస్త్రి పాటం వప్పజెప్పమన్నాడు. పిల్లవాని పేరు పూర్ణచంద్ర. చంద్రునిలాగే ఆహ్లాదంగా వుంటాడు. బుద్ధిగా నించుని చేతులు కట్టుకుని వప్పజెప్పతున్నాడు.

యెద్దుకైవ గాని యేడాది తెల్పినా
మాట దెలిసి నడుచు మర్మ మెఱిగి
మూర్ఖుడరయిలేడు మువ్పదేండ్లకునైన

అంటుండగా తలుపు విడిబడి ఓబయ్య లోపలికొచ్చేశాడు. శాస్త్రి లేచి పిల్లవాడిని పట్టుకుని తనవెనక నించో పెట్టాడు.

నీకింకేం శతకాలూ, పద్యాలూ రావా శాస్త్రీ? అదేనా పిల్లలకు నెర్పేది? అని వురిమి చూశాడు.

వొంచుండి వినటమే తప్పు ఉలుకు రోగం కుదుర్చుకోక పోవటం రెండోతప్పు శాస్త్రి అన్నాడు.

ఓబయ్య మీదికొచ్చాడు. శాస్త్రి ఉత్తరీయం నడుముకి బిగించాడు. ఛాతీ చూపించాడు.

ఇది మునసబుగారి యిల్లు. నీ యిల్లుగాదు తన కోపమె తన శత్రువు అంటుండగా మునసబుగారు లోపలికొచ్చారు.

ఒబయ్యా! నీకోసం మెజిస్ట్రేట్ రామనాథం గారొచ్చారు అని రెక్కపట్టుకొన్నాడు ఆయన్ని చూడగానె గదిలో దూరావెందుకూ అని నవ్వుతూ నడిపించుకెళ్ళారు.

పూర్ణచంద్ర నవ్వుతూ ముందుకొచ్చాడు.

శాస్త్రి కూచున్నాడు.

కూచోచండు?డూ? యేదీ లెక్కల పుస్తకం? ఓబయ్యనీకే వ:పుతాడు? అనడిగాడు.

మామయ్య అవుతాడు. మానాన్న పెళ్లి సంబంధం కుదిరింది రమ్మని రాస్తే వచ్చాడు.

"పెళ్లి చేసుకుంటానన్నాడా ఓబయ్య."

అనలేదు మాష్టారు. మా పిన్ని వాయులీనం నెరుస్తుంది ఆ మేష్టర్ని మాన్పించటానికి వచ్చాడు అని నవ్వాడు.

అపని చేశాడూ! అశ్చర్యపోయినాడు శాస్త్రి

ఆ, చేశాడు.

'యెట్లా చేశాడూ?

పిన్ని మేష్టరు వెనకాలే వెళ్లి? వాడి కులము పుట్టుక సేకరించి వచ్చాడు. నీవు వానికి చావవేయరాదు, వానినే వేసుకోమనుము. మనము అగ్రకులజులము. వాడు హీన కులజుడు. నేను నీకు బ్రాహ్మిన్నే మేష్టరుగా కుదిర్చి పెట్టెదను. వీనిని మాన్పించితిని వీడు నిన్ను లొందదీసి చెరచును. అని పిన్నికి చెప్పాడు.

మరొకసారి వెంటబడి వెళ్లి ఆ మేష్టర్ని చీకటిలో పట్టుకుని తన్నాడు. నీవు మరల ఆ యింటిలో కనబడితివా కూనీచేసెదను అన్నాడట మామయ్యే చెప్పాడు. ఆ మేష్టరు భయపడి ఇక రాలేదు? పిన్ని యేడిచి అన్నది గురువుగదూ చావవేయాలి, వేసుకోమనరాదుఅంటే చెంపలు వాయిస్తా అన్నాడు గోపి,

కొత్త పాటం చెప్తున్నా అను

గోపి పుస్తకం చూస్తూ నవ్వుతూ అన్నాడు.
"తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయచుట్టంబౌ".
లోపల్నించి వాళ్ళమ్మ కేకవేసింగి.

చంద్రూ బడికివేళ్ళైంది, అన్నం తినాలి, పళ్ళెంలో పెట్టాను.

ఏం, రేపు చదువుదాంలే మిగిలింది.

## 4

"తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు"
రాదు అంటే తెలియలేదు మేష్టారూ! అన్నది సుశీల.

రాదు అంటే అసాధ్యము అని చెపితే సరిగా సరిపోతుంది, అంతకు ముందు లైనులో సాధింపవచ్చు అన్నాడు గదూ కవి! అంటే వీలున్నదని.

సుశీల ఓబయ్యకి పింతల్లి కూతురు, మెట్రిక్‌కి అప్పియరు కాబోతున్నది, వాళ్ళ నాన్న ట్యూషన్ పెట్టాడు.

మా అమ్మాయి మొదటిసారే పాసుగావాలి శాస్త్రుర్లూ, నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోటమైంది, నువ్వు ట్యూషన్ చెప్పినవాళ్ళు తప్పక పాసౌతున్నారని విని నిన్ను పెట్టాను అన్నాడు తండ్రి.

తప్పకుండా మీ అమ్మాయి పాసౌతుంది, స్టాండర్డ్ చూశా,

నేనూరికే సాయ్యం, మీరు నిశ్చింతగా వుండచ్చు, తండ్రి వెళ్ళి పోయాడు.

ఆ గొంతు ఓబయ్యదిలాగా వున్నదే? సుశీలను చూస్తు అడిగాడు శాస్త్రి.

అవును మాష్టారూ, మా అన్న వాడి ఫ్రెండూ నిన్న వచ్చారు, ఫ్రెండు శరభయ్య అత్తవారి వూరే. మా దొడ్లో కొబ్బరి చెట్లు నీటిబొండాలిస్తాయి, కొబ్బరినీరు చాలా తీపి, ఆ కొబ్బరి నీరు తాగాలని వచ్చారు వాళ్ళిద్దరూ, చూస్తారా? అని లేచి దొడ్డివేపు వెళ్ళింది సుశీల.

శాస్త్రీ లేచి వెళ్ళాడు, ఓబయ్య చెరుకుగడ చేతితోనే బంండకు బాది విరిచి ముక్కలు చేస్తు కంటబడ్డాడు. నోటిలోని వళ్ళతో చీల్చి పై భాగం తీసి కొంత తిని రసం మింగి పిప్పి వుమ్మేస్తున్నాడు, శరభయ్య కొడవలీ కత్తీ దగ్గరుంచుకుని వాటి సాయంతో చెరకు బిళ్ళలు తింటున్నాడు, ఆకుమీద కుప్ప బెడుతున్నాడు.

బొండాలు గూడా చేతితోనే పగలగొట్టి నీళ్ళు తాగచ్చు శరభయ్యా! మోచేత్తో లేత కొబ్బరిపెంకు పగలగొట్టి లేతకొబ్బరీ మీగడలాగా తినేయచ్చు, పళ్ళుగూ అక్కర్లా, కొడవలీ అక్కర్లా ఓబయ్య నవ్వుతున్నాడు.

శరభయ్య తీయి చూద్దాం అన్నాడు.

ఓబయ్య శాస్త్రిని చూశాడు.

నువ్విక్కడికెందుకొచ్చా శాస్త్రీ? అన్నాడు కటువుగా.

నీకు తెలియదూ యెందుకొస్తానో, ట్యూషన్ చెప్పటానికి వస్తాను, నువ్వెందుకొచ్చావూ?

నీ ట్యూషనూ నువ్వూ, మవ్వు చెపితేగాని పాసుగాదా యేం సుశీల?

యేమో మీ బాబాయినే అడుగు.

...వచ్చి బొండాం వగలగొడతా చూడు.

నేలమీదా రాతిమీదా కొడితే పెచ్చూడింది, చిట్లినచోట వేళ్ళు దూర్చి కొంచెం కొంచెం పెచ్చు అంతా వూడదీశాడు ఓబయ్య, వదునైన వెదురుపుల్ల తెచ్చి, మూడు కళ్ళున్నచోట కన్నంవేసి, పెంకుతీసి కన్నం పెద్దది చేశాడు.

చూశావా శరభయ్యా! ఇంద నీరు తాగు, నీకోటి కావాలా శాస్త్రి?

కావాలి.

యేం చెపుతున్నావు.

భర్తృహరి సుభాషితం, మూర్ఖపద్ధతి.

"యెప్పుడూ అలాటివే యెందుకు చెపుతావూ? యెప్పుడో నాచేత తన్నులు తింటావు."

"నీ మాటతీరే చెపుతున్నది నీ మనస్సులో వున్నది."

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు".

ఇంకా విశదమైంది.

ఓబయ్య లేచాడు, కొబ్బరినీళ్ళు తాగటమయాక యింటో కెళ్ళారంతా, ఓబయ్య స్నానం చేసివచ్చి తల తుడుచుకుంటు

న్నాడు. సుశీల వరండాలో కూచుని, ఒక వర్తకుడు తెచ్చిన సుగంధ ద్రవ్యాలు కొంటున్నది.

"అమ్మా! యిది సాంబ్రాణీ, తలకు పొగవేసుకుంటే, జుట్టంతా మంచి వాసన పట్టుతుంది. ఇది పాలమడ్డి, నూనె చేయి చేసుకుని బిళ్ళలాగా చేసి నిప్పు కణిక మీదుంచితే సువాసన గల పొగ వస్తుంది. చిన్న బిళ్ళ చాలు, దానితోనే యిల్లంతా పరిమళం వ్యాపిస్తుంది. స్నానం చేసిన తల తుడుచుకుని వేసుకోవాలి, పళ్ళెంలోగానీ, గరిటెలోగానీ నిప్పు కణికలుంచి వాటిపై పాలమడ్డీ బిళ్ళపుంచి, పైన వెదురుబుట్ట పుంచితే పొగ వస్తుంది. బుట్టమీద తలపుంచాలి, ఇది చందినీ అత్తరు, ఇది మంచి గంధపు పొడి, ఇది పన్నీరు, ఇది సెంటు, గుల్‌బహార్, ఇది సూర్జహన్, తీసుకో తల్లీ! తరుచూ రాలేను."

సుశీల కొనుక్కున్నది, తండ్రి డబ్బు చెల్లించి వర్తకుని పంపేశాడు.

ఓబయ్య, "సుశీలా నిప్పు పట్రా, పాలమడ్డి వాడి చూద్దాం, స్నానంచేసి తల తుడుచుకున్నాను" అన్నాడు. వర్తకుడు చెప్పిన పద్ధతిలో పొగ వేసుకోటమైంది.

"అద్దం దువ్వెనా యివ్వు" సుశీల అద్దమిచ్చి వెళ్ళింది. శరభయ్యా, ఓబయ్యా కూచుని తల దువ్వుకుని అద్దం కింద బెట్టారు.

"శరభయ్యా! ఒక్క గుద్దుకి యీ అద్దం పగలకొడతా చూడు" అన్నాడు ఓబయ్య.

"అది చాలా మందంగా వున్నది, దాన్ని బిళ్ళేరు అద్ద మంటారు, నీవల్ల గాదు రాయి వాడాలేమో" శరభయ్య అన్నాడు.

రాయీ అక్కర్లా, రప్పా అక్కర్లా చూడు, బలంగా ఒక గుద్దు వేశాడు ఓబయ్య, అద్దం మధ్య చిట్లి ముక్కలుగాక విడిబడకుండా వుండిపోయింది.

సుశీల వచ్చి చూసింది, పెద్దగా యేడిచింది.

నా అద్దం, నువ్వు కొనిబెట్టింది, పగలగొట్టాడు, నేనేం చేశాను, ఇదేం పని? నా మొహం యిందులో చూసుకుంటె, నా మొహం మీదెవరో కొట్టినట్టుంది, కళ్ళు నులుపుకుంటున్నది.

వాళ్ళ నాన్నవచ్చి సముదాయించాడు.

ఊరుకో తల్లీ మరొకటి కొనిబెడతా? అంతకంటె మంచిది తెస్తా, చుట్టూ పూలూ లతలూ వున్నది తెస్తా, నీకు కనబడేచోట గోడకు గొలుసుతో కట్టిస్తా, యేడవకు, కూతుర్ని లేవదీసి తీసికెళ్ళాడాయన.

రెండు కొబ్బరి బొండాలకి తాడు కలిపి చేతితో పట్టుకుని వెళ్ళొస్తానని చెప్పటానికి వచ్చిన శాస్త్రి యీ సీను చూసి తల పంకించాడు.

వికృతపు నవ్వు మొహం మీదికి రాగా, ఓబయ్య యింటి కేనా? అనడిగాడు.

ఇంటికే బ్రిహ్మచారీ! అని వెళ్ళిపోయాడు శాస్త్రి.

## 5

కబ్బయ్య ప్రైవేటుగా తెలుగువిద్వాన్ పరీక్షకి సిద్ధమవు తున్నాడు, శాస్త్రి దగ్గరే చదువుకున్నాడు మొదటినించీ, కొంత స్తోమత వచ్చాక, తానే చదువుకుంటూ యెప్పుడైనా సందేహాలు తీర్చుకోటానికి వస్తు వుంటాడు కబ్బయ్య.

ఆనాడు కబ్బయ్య పుస్తకం తెరిచివుంచి సందేహం తీర్చుకుంటుండగా ఓబయ్యవచ్చి కూచున్నాడు. తానూ సందే హాలు తీర్చగలనన్నాడు. శాస్త్రికంటే యెక్కువే చదివాడుట, డిగ్రీలేకపోతేనేం, పంచకావ్యాలూ, భారత భాగవతాలూ, కంఠో పాఠం చేశాడుట, యెక్కడడిగినా విశదీకరిస్తాడుట. ఛందస్సు వ్యాకరణం, తర్కం బాగా వచ్చునని చెప్పి నవ్వుతూ కూచు న్నాడు. తానూ ట్యూషన్సు తీసుకున్నాడుట. ధోవతి వుత్త రీయం, మొహాన వీభూతి మధ్యబొట్టు, కళ్ళార్పుతూ చూస్తూ కూచున్నాడు. కబ్బయ్య పరిశీలనగా చూపాడు.

సన్యసించట మెందుకు? కోరికలు చావలైపాయె. అహం గెలుస్తూ వుంటుంది. అయిదు గొఱ్ఱెలు పులిని చంపుతాయి, యీ వింత చూశావా? అన్నారు బోతులూరి వీరబ్రహ్మంగారు. బ్రహ్మంగారి తత్త్వాలు అర్థం గావటం కష్టమండీ. కబ్బయ్య శాస్త్రివంకే చూస్తూ అడిగాడు.

శాస్త్రి నవ్వుతూ చెప్పాడు.

కష్టమేం లేదు కబ్బయ్యా! అంతరాత్మ పులి. అయిదు యింద్రియాలు గొఱ్ఱెలు. అంతరాత్మ చెప్పేదివిని యింద్రి

యాలు పనిచేయాలి. కాని వింత ఏమిటంటే మనయింద్రి యాలు అంతరాత్మ చెప్పేది వినవు. దానికి వెరవవు. దాని నోరునొక్కి ప్రపంచం లోని అకర్షణకు జీవుని లొంగదీస్తాయి జీవుడు అవి చూపినవేపు పరుగెత్తుతాడు. అది తెలుసుకోవాలి అంటున్నారు బ్రహ్మంగారు.

ఓబయ్య చెప్పాడు.

సన్యాసిని యేం చేస్తున్నావు అని యెవరూ అడగరు, అదీలాభం, యేమీచేయటం యిష్టంలేనివాడు సన్యసిస్తే సుఖం బాగా నవ్వాడు ఓబయ్య.

ఆ నవ్వుతో తానూ సృతికలుపక కబ్బయ్య అడిగాడు

నువ్వింకా సన్యసించలేదు. జంద్యం వున్నది. విభూతి రేఖలూ బొట్టూ, బిళ్ళగోచీ, నీవు అన్నీ త్యజించిన వాడివి కావని చెపుతున్నాయి కనక యేం చేస్తూవుంటావు అని అడుగు తున్నాను.

శాస్త్రిని చూడాలని నిన్ననే వూరినుంచి వచ్చినవాడు యేమి చేస్తూ వుంటాడు. కోపంగా చూశాడు ఓబయ్య

తింటూవుంటాడు, పొంట్లు కోబిస్తూఉంటాడు. అవీ వస్తే ఇంకా పెటుకుగా మాట్లాడుతూ, కటువుగా దూషచేస్ఛె అవకాశ మున్నది. కబ్బయ సవ్వ మొహం చూచాడు ఓబయ్య.

నీ సొమ్ము తింటున్నట్టు నీ కెందుకుబాధ? నాకు వరసకు తమ్ముడైనవాడిని చూచిపోవాలని వచ్చాను. నీతాతముల్లెఖర్చు

చేయిస్తున్నట్టు కుములు తున్నావేం. నీవుతినవు ఒకరికిపెట్టవు కట్టుకుపోతావేమో, పోయేనాడూ వెంటడిరాదూ పూచికపుల్ల యినా, వెటకారంచేస్తూ నవ్వుతూపాడాడు.

కోపము నుబ్బును గర్వము అపోవని దురభిమానము నిర్వ్యాపారత్వము కాపురుష గుణంబులండ్రు, కబ్బయ్య పద్యం చదవటం పూర్తిగాలేదు. ఓబయ్య చెయ్యెత్తడంచూసి శాస్త్రి అడ్డుపడడంవల్ల ఆదెబ్బ శాస్త్రిమీదపడింది. శాస్త్రి బలంగా ఓబయ్యచెయ్యి పట్టుకున్నాడు.

నీ వయస్సులో సగం వయసున్నవాడిని బాదటంపురుష లక్షణంగాదు పండితపుత్రా! మనిద్దరం మల్లయుద్ధం చేస్తే బాగుంటుంది బ్రహ్మచారీ! శాస్త్రి శాంతగా అన్నాడు.

వాడు నన్ను బయట పెడుకున్నాడు. ఒక్కటంటిస్తే యేదిచదవాలో యేది చదవగూడదో తెలుస్తుంది. చెయ్యి వదులు, తీవ్రంగా చూశాడు.

నీ పూర్వాశ్రమం కబ్బయ్యకు తెలియదు ఓబయ్యా! ఆరతంలో పద్యం గుర్తువచ్చి చదివాడు, నువ్వు ఉలిక్కిపడ్డావు అధికి కూడా మందున్నది.

యేరా కబ్బా! తెలియకే చదివావా?

ఏమిటి తెలియక? ఓబయ్యనే చూస్తు అడిగాడు.

నేను వుద్యోగం వదిలేసినట్లు తెలిసే చదివావు.

ఏం వుద్యోగం?

హొటల్ ప్రొప్రయిటరుగా మంచిలాభసాటి వుద్యోగం చేస్తు వదిలేశాడు కబ్బయ్య ! శాస్త్రి చెప్పాడు.

యెందుకొదియాల్సి వచ్చిందట ? కబ్బయ్య. అమా యికంగా చూస్తు అడిగాడు.

వుద్యోగమిచ్చిన చవటాయికి, నాసమర్థత తెలియదు. అన్నిటికీ అడ్డుపుల్ల వేయనూ, సలహాలివ్వనూ చేశాడు. "నువ్వే యేడ్చుకో" అని ఉన్నవళంగా సట్టిట్లో వదిలేసి వచ్చేశా ఆహ! హ, ఆ మేనేజరు శుంఠకి లెక్కలురావు. జమా ఖర్చులు రాసుకోటం రాదు. పీకల వరకు అప్పుల్లో వున్నాడు. వికటంగా నవ్వాడు ఓబయ్య.

అయ్యో నోటీసివ్వాలే, ఆయన నీకాళ్ళమీద వడలేదూ? కబ్బయ్య నోటిమీద చెయ్యి వేసుకున్నాడు.

పడ్డాడు కబ్బా ! మొత్తం బిజినెసంతా నా స్వాధీనం చేయాలి. నామాట కెదురు చెప్పరాదు. ఆ షరతు మీద చేస్తానన్నా. వాడేదో హామీతెమ్మన్నాడు.

కబ్బయ్య కళ్ళు పెద్దవైనాయి.

నీకా? హామీయా? ఇంకానయం. నది,యేరే మంచిదేమో మునిగి పోవడానికి.

ఈమాటు కబ్బయ్యను గభీమనిలాగేశాడు శాస్త్రి

ఓబయ్య చెయ్యి అక్కడువున్న నీళ్ళ బిందెను తాకి మంచి నీరంతా నేల పాలైంది. బిందె దొర్లిపోయింది.

కబ్బయ్యను పంపేశాడు శాస్త్రి.

## 6

విద్యత్ సభకివెళ్ళి వస్తున్నాడు శాస్త్రి. అష్టావధానం శతావధానం చూసి, పృచ్ఛకుడుగా వుండివచ్చాడు.

రైలులో కలిశాడు కబ్బయ్య

మనుగుడుపుల పెళ్లికొడుకులాగా, మిసమిసలాడుతున్నావు కబ్బయ్యా! అత్తవారింటి నించేనా? వీపుచరిచి అడిగాడు శాస్త్రి. అతని సంచీ అందుకుని కిందవుంచాడు.

చక్కగా వూహించారు శాస్త్రీజీ, ఇంటికి పోతున్నా సంచీలోనివి, తినేవి యెండుఆకుల్లో పొట్లం కట్టివున్నవితీసి శాస్త్రి కందించాడు కబ్బయ్య,

శాస్త్రి ఆప్యాయంగా అందుకుని తనసంచీలో పదిలంచేశాడు. మరి నన్ను పిలవలేదేం? అనడిగాడు,

మీరంతా పూరికెళ్లారన్నారు. శుభలేఖ కిటికీ తలుపుగుండాదూర్చి యింట్లో వడేట్లుచేశా. మేమేమో, అన్నవరంలో పనికానిచ్చి త్వరగా వచ్చేశాం ఇంటిదగ్గర హడావడీ, అన్నీ అమర్చి, గృహప్రవేశం, సత్యన్నారాయణ వ్రతం, అయిందనిపించి మళ్లా అత్తవారింటి కెళ్ళి భార్యామణిని అక్కడవదలి తిరిగి వస్తున్నా.

యెన్నాళ్లు చేశారు పెళ్లి?

యెన్నాళ్లు గూడానా? ఒక్కపూట, అదేదో మొక్కుబడి తీర్చుకున్నట్లు జరిపించేశారు. యెంతజాగ్రత్తవడ్డా ఖర్చు

యెక్కువై అప్పుచేయాల్సి వచ్చింది గురూజీ. యెలాతీరు స్తానో. నవ్వా విచారం కలిపాడు కబ్బయ్య.

నీదంతా చోద్యం, జూనియర్ కాలేజీలో లెక్చరరువై తి విగా, మీనాన్న నేర్పుగా కట్నం లాగుతాడే!

లాగుతాడుగానీ గురూజీ! గొప్పలకిపోయి, కోడలువంటి మీద బంగార ముంచాలనీ, సంభావనలకనీ అంతా ఖర్చు చేసాశాడు. రానూపోనూ బస్సుమాట్లాడాడు. ఇదంతా కట్నం తోనే అవుతుందంటారా? చాలదేమోనని మిగిలేట్టు కట్నమిస్తారా? కబ్బయ్యనవ్వాడు. "మీరెక్కడికీ? బ్రహ్మచారీ అంటూండే వారే ఆ బంధువు గృహస్తు అయినాడా?

కాలేదు, కాలేదు. కబ్బయ్యా. బ్రహ్మచారిగానే వున్నాడు పెళ్లాం పిల్లల్ని పోషించాలని లేదుట, రమ్మనిరాస్తే, దోవలోనే గదా వాడివూరూనని పోతున్నా. దేని కాహ్వానించాడో అదీ విశదీకరించలేదు.

రైలుచప్పుడు వింటూనే కబ్బయ్య అడిగాడు.

యేమైనా నౌకరీలో వున్నారా ఓబయ్యగారు.

అదీలేదు ఆరంభశూరత్వమని, మొదట్లోవళ్లువంచి, మన స్సునివంచి పనిచేసి లాభంచూపిస్తాడు. వాళ్ళు మోసపోతారు నెత్తిన చెయ్యి పెట్టాలని చూస్తున్నాడని తెలియగానే ఉద్వా సన చెపుతారు స్వస్తి వినటం పరిపాటై పోయింది ఓబయ్యకు ఉద్యోగం పూడుతుందని ఆలోచించడు.

నాస్టేషనొస్తున్నది గురూజీ. మళ్లాకలుద్దాం రేపు సోమ వారం క్లాసున్నది. నమస్కారం.

సుఖీభవ అన్నాడు శాస్త్రి. రైలాగింది.

7

నువ్వు మాట్లాడుతుంటే, ధృతరాష్ట్రుని పెద్దకొడుకు తలంపుకు వస్తున్నాడు ఓబయ్యా! తోడబుట్టిన వాళ్ళకి, వాళ్ళపంతు వాళ్ళకిచ్చేసి, నీవంతు నీయిష్టమొచ్చినట్లు తగలేసుకో యెవ్వరేమనరు. ఇప్పటి న్యాయశాస్త్ర ప్రకారం అడపిల్లలకిగూడా పిత్రార్జితంలో భాగమున్నది. కోర్టుకెళ్లకు మొసళ్లు పట్టుకుంటాయి.

ఒక్క దమ్మిడీ యివ్వను. ఓబయ్య అభినయించాడు.

అదుగో చూశావా. అంబికేయుని ప్రథమ పుత్రునిలాగా అంటున్నావు బాగా ఆలోచించు. కోర్టుకెక్కకు!

వాళ్లెవరికి పుట్టారో! బస్తీమీదసవాల్ అని యింటికోడలు పడగ్గది తలుపు తీసేసింది. క్రూరంగానవ్వాడు ఓబయ్య.

పోనీ చెల్లెళ్ళకిపంచు. యెట్లాగయినా మంచిచేయిద్దామని చూచాడుశాస్త్రి.

వాళ్లా వుద్యోగాలు వెలిగిస్తువ్నట్లు ప్రపంచానికిచూపతూ స్వేచ్ఛా విహంగాలల్లే తయారైనారు. అదుపూ అజ్ఞాలేవు. అన్న అనే గౌరవంలేదు. అనుభవిస్తారు. పరువూ ప్రతిష్టా పోయి ఆస్తి కోసం అర్రులు చాస్తున్నారు. నాతత్త్వం తెలియదు వాళ్ళకి ఒక సెంటు భూమి చెందనీయను. ఒక్కపైసా చేతికి రాదు.

పోనీ అంతా నీకే చెందుతుందని ఆశిద్దాం ఓబయ్యా! ఒక్కడివేగా. అంతెందుకు ఏమిచేస్తావు?

అమ్మేస్తాను. లక్షలు వస్తాయి. రాజధానికి పోతాను. పార్టీస్థాపిస్తాను. స్కాండౌతాను. సి. యం. అవుతాను. అప్పుడు తెలుస్తుంది నా పవర్. ఓబయ్య మొహం సియం అయినట్లే వెలిగిపోయింది.

"సియం కావటానికి లక్షలు చాలవేమో, ఓబయ్యా, కోట్లు కావాలేమో. ఇదేదో కథల్లే వున్నది, యుద్ధభూమికి వక్క వెళ్ళిందిట, హతులైన మనుషుల్నీ గుఱ్ఱాల్నీ యేనుగుల్నీ చూసిందిట, పొంగిపోయింది. చాలా ఆహారం కంటబడింది. 'ఇవాళ్టికి యీ నారి కొరికి ఆకలి తీర్చుకుంటాను' "కథ పూర్తి చేయకుండానే లేవబోయాడు.

"అదేం కథ? నీ పద్యాలూ నీ కథలూ నన్నేం చేయలేవు శాస్త్రీ, మొత్తమంతా నాకుచెందేట్టు వీలునామా వ్రాయబడింది. సాక్షి సంతకాలున్నాయి, నన్నెవరేం చేయలేరు. చివరి రోజుల్లో మనిషిని కనిబెట్టి వుండి స్నానపానాదులూ, మందుమాకులూ చూసింది నేను. గొడ్డుచాకిరీ నెత్తినేసుకుని కంటికి రెప్పలాగా చూశాను. కవర్‌కోసం లేచాడు ఓబయ్య, ఒళ్ళోవున్న వుత్తరాలు కిందబడ్డాయి, ఓబయ్య వాటిని చూడలేదు, వీలునామా తేవాలని గదిలోకి వెళ్ళాడు.

పోస్టు కార్డుమీద వ్రాయబడిన వుత్తరాలు రెండు చదివి కింద వుంచేశాడు శాస్త్రి, మరోటి కంటబడింది.

నీకేమీ చెందదు, నువ్వేమీ చేయలేదు, ఆదుకోలేదు,

ఔషధమిప్పించలేదు, ఆస్తి అంతా నాపేర రిజిష్టరు అయింది. నువ్వు వచ్చి గొంతు చించుకున్నా యేమీ లాభముండదు, ఒక్క పైసా రాలదు.

రెండవ కార్డు విడిబడి కిందబడింది.

మీరెవ్వరూ రానవసరం లేదు, మీరు మాకేమీ చేయలేదు, అడుగుల చప్పుడు విని శాస్త్రి వుత్తరం కింద వుంచేశాడు.

ఓబయ్య అన్నాడు, "పెట్టినచోట లేదు కవరు, వెతకాలి, కూచో, లేచావేం?"

"మళ్ళా వస్తా పండితపుత్రా, రేపు పితృదినం, తద్దినం పెట్టి వచ్చి నిదానంగా వీలునామా చూస్తా."

వెళ్ళిపోతున్న శాస్త్రిని చూస్తు ఓబయ్య కేకవేశాడు.

"తప్పక రావాలి."

## 8

ఓబయ్య యిచ్చిన తంతి చూసుకుని, "విచిత్రంగా వున్నదే!" అనుకుంటూ బయలుదేరాడు శాస్త్రి. రైలు దిగుతుండగానే, ప్లాట్‌ఫామ్ మీదే యెదురైనాడు ఓబయ్య. గేటు దాటగానే ఆటో అందింది. యెక్కి యింటికి చేరారు. ఓబయ్య వంటచేసే స్టేషన్కి వచ్చాడు.

స్నానం కానీ శాస్త్రి, వేడి నీళ్ళుంచాను, వడ్డించేస్తున్నా అన్నాడు, బాదమాకుల విస్తళ్ళు తెచ్చాడు.

భోజనమైతే రుచిగా వున్నది, కమ్మని నెయ్యి, గడ్డ పెరుగు, సన్నబియ్యపన్నం, పప్పు, కూరా, చారూ, అప్పడం, వడియం, వూరగాయా భోజనమవుతున్నది.

దేనికి అర్జంటుగా రమ్మన్నావు ఓబయ్యా, నేను సంసార మనే జంఝాటంలో వుంటిని, బ్రహ్మచారిని గానని నీకు తెలుసు, తల్లి లేవలేదు.

చెప్తా, కానీయి, ఇల్లు నీకు చెందదు, ఖాళీ చేయమని అన్నారు, వీలునామా చూపించాను, వాళ్ళదగ్గర మరొక వీలు నామా వున్నది, అది చూపించారు. 'ఈ యిల్లు ముందే అమ్మబడింది, నువ్వు వాళ్ళ అమ్మజూపుతున్నావు, కేసౌతుంది. కొనబోయేవారు కోర్టుకెక్కాలి. నువ్వు యీ యింట్లో ఒక్క సంవత్సరం వుండచ్చని ఖరారు చేసుకున్నాము. సంవత్సరం ముగిసింది. నువ్వు ఖాళీ చేయకపోగా అమ్మజూస్తున్నావు. వేరే మార్గం లేక కలగజేసుకున్నాము' అని వితండవాదం చేశారు. అంతేగాక, చావగొట్టమని గూండాలకు డబ్బు యిచ్చి తోలారు. వాళ్ళు ఆరుగురు, నేనొక్కడినే, కర్రసాము చిన్న వ్వుడే నేర్చాననుకో, ఒక్కడితో అయితే యెప్పుడో బుర్రపగల గొట్టేవాడిని, మరి ఆరుగురితోనా, పోలీసు ఆఫీసరుతో చెపితే, 'యిల్లు ఖాళీచేసి పొండి, బాడీగార్డునివ్వం. మీరు యిదివరలో చేతికందినవాడినల్లా చితక తన్ని తిరి. తన్నులు తిన్నవాళ్ళ సంఖ్య యెక్కువగానే వున్నది, ఒక్క కానిస్టేబుల్ యేం చేయ గలడు? మీరు మా వాళ్ళమీద చెయ్యి చేసుకుంటిరి, మంచిగానే యిల్లు స్వాధీనం చేయండి' అని చవట సలహా యిచ్చాడు. 'కనీసం పదిమంది బాడీగార్డ్సునన్నా యివ్వాలి' అంటే 'మీరే పెట్టుకుంటే మంచిది. మేం పెడితే వాళ్ళకి మీరు వంటచేసి వడ్డించాలి' అని గెంటేశాడు అన్నాడు ఓబయ్య.

మధ్యాహ్నం ఓబయ్య విశ్రాంతి తీసుకుంటుండగా శాస్త్రి పక్కింటోనించి ఫోన్ మాట విని వెళ్ళాడు. పక్కింటివారి పని అయాక, ఒకసారి కావాలని అడిగాడు డైరెక్టరీ చూసి ఫోన్ చేసి వచ్చేశాడు. మూడింటికల్లా అతిథులు వచ్చారు. వారిలో బాగా తెలిసినవారూ వున్నారు.

ఓబయ్య కాఫీ ఫలహారం స్వయంగా తయారుచేసి అందరికీ అందించాడు.

టైమ్ వేస్టు చేయకుండా వ్యవహారం యెత్తాడు శాస్త్రి.

"మా బంధువు వీలునామా చూపించాడు, అంతా తనకే చెందుతుందనీ, అమ్మే హక్కు వున్నదనీ అంటాడు. వీలునామాలో యెక్కడా తప్పులు లేవు, ఇల్లు ఖాళీచేయమని దండగులు, ఒక్కడే వున్నాడేమి చేయగలడని ఎటాక్‌చేసి, హింసకు పాల్పడుతున్నారు."

"అదంతా నిజమేననుకోండి శాస్త్రిగారూ! కాని యీ యిల్లు అమ్మినవారు, కళ్ళు బాగా వుండగా, చూపు చక్కగా వుండగా అమ్మారు. ఇవుగో క్రయ విక్రయానికి సంబంధించిన దస్తావేజులు. అంతేగాక మీ బంధువు చూపే వీలునామా రెండవ సారి వ్రాయబడింది. అప్పటికి శుక్లాలు ముదిరి చూపు పూర్తిగా మందగించింది, సంతకం చేసేవారికి, సంతకం యెలా చేశారంటారు. కనక అది ఫోర్జరీ, లా ప్రకారం మొదట వ్రాయించి సంతకం చేసిన వీలునామాయే పవర్‌ఫుల్, చూపు బాగున్నప్పుడే యిల్లు అమ్మబడిందని ఋజువు చేశాము. రెండవ మరణశాసనం తాను వ్రాయించి, సాక్షులచేత సంతకాలు

చేయించి, అసలు సంతకం తానే చేశాడని, చేవ్రాలు గుర్తించే నిపుణుడు చెప్పాడు. రెండవ వీలునామా చెల్లదు, మర్యాద గానే యిల్లు స్వాధీనం చేయటం మంచిపద్ధతి అన్నారు.

"యేమంటావ్ పండితపుత్రా! అసలు యింట్లో అంత డబ్బు యెక్కడిదీ అనే ఆలోచన రాలేదు నీకూ? యాత్రలు చేయించి తెస్తివి, యజ్ఞయాగాదులూ, నోములూ వ్రతాలూ, పుస్తకాలు ప్రచురించటం ఇన్నిటికి డబ్బెక్కడిదీ అనే సంశయం రాలేదూ ఆనాడే?"

నేను నీకు సంజాయిషీ యివ్వక్కర్లేదు శాస్త్రీ! నువ్వు వారితో షరీకై గూడుపుఠాణీ చేస్తున్నావు.

యేమైనా అను, పడతాను, కానీ మర్యాదగానే వెళ్ళిపో, అదే మంచి పద్ధతి, శాస్త్రి లేవటం చూసి తక్కినవారూ లేచారు.

## 9

యేం కబ్బయ్యా! నా యిల్లు పావనం చేశావు, వాన వస్తుందేమో చూచో అన్నాడు శాస్త్రి.

మీదంతా హాస్యం, మీచేత తిట్లు తినటమే గౌరవం నాకు, ఈ వుత్తరం చూపిద్దామని వచ్చాను, యేం చేయాలో తెలియదు, నాకు వడ్డీకి అప్పు తేవటం తీర్చటం, వడ్డీకి అప్పు యివ్వటం వంటి తెలివితేటలూ, స్తోమతా వున్నాయంటారా? నేను మీకు తెలుసుగా, పొదుపుగా నెల వెళ్ళదీయటమే గొప్ప నాకు, ఇలా అసత్యప్రచారం చేసి హడలగొడితే యేం చేయాలో తెలియదు. నెత్తి గోక్కుంటూ వుత్తరమిచ్చాడు కబ్బయ్య.

శాస్త్రి చదివాడు.

మీరు ఓబయ్యగారికి అయిదువేలు బాకీ వున్నారుట, చేబదులని అడిగి తీసుకున్నారుట, ఈ వుత్తరాన్ని టెలిగ్రామ్‌గా భావించి, వారికివ్వాల్సిన అయిదువేలూ, క్రాస్డ్ చెక్ వ్రాసి పంపితే, వారికి వైద్యము మొదలుపెట్టుతాము, వారు నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ అయినారు, కేసు సీరియస్ కాకముందు శస్త్ర చికిత్స చేయాలి. ఇది ప్రైవేట్ సంస్థ గనక, ముంచే చెల్లించాలి, వారికి ఆహారపానీయాలు సప్లై చేయాలి.

మేనేజర్
గణపతి నర్సింగ్ హోమ్
రాజధాని.

నీకూ పంపాడన్న మాట నోటీసు, జబర్దస్తీకి లొంగిపోతారని అనుకుంటారు అన్నాడు శాస్త్రి, వుత్తరమిచ్చేశాడు.

జబర్దస్తీ యేమో కానండి, యేం చేయాలో తెలియటం లేదు, కబ్బయ్య చేతులు నలుపుకుంటూ అన్నాడు.

కబ్బయ్య బుజంమీద రాచి, తట్టి శాస్త్రి అన్నాడు.

యేం చేయక్కర్లా కబ్బయ్యా, ఇలాంటిదే నాకూ అందింది, నేను శత్రుపక్షం మాట్లాడానని, నామీద దెబ్బతీయాలని చూశాడు ఓబయ్య, కాని నీకూ యిలాంటి వుత్తరం వస్తుందని వూహించలేదు నేను, నీకింక యిలాంటి వుత్తరం రాదు, నేను భరోసా యిస్తున్నాగా.

యెలా యిస్తున్నారూ? యెందుకని రాదూ? యెట్లా నమ్మనూ.

నమ్మి నమ్మకపో, ఇంక రాదు, తెలుసుకోవాలనుంటే విను, ఒక్క నెలలో లక్షరూపాయలు యెలా దూబరా చేశాడో ఓబయ్య, సద్గతులనీ, అపర కర్మలకనీ, దాన ధర్మాలనీ, యెంతమంది సోమరులను, స్వాములను మేపి తృప్తిపరిచాడో, రక్త సంబంధమున్నవారికి యేమీ చెందకుండా యెలా జాగ్రత్తపడ్డాడో, వివరంగా వ్రాసి, సాక్షి సంతకాలు పెట్టించా, రసీదులూ జతపరిచాను, పాపర్‌దావా వేయాలనీ, గెలుస్తావనీ, నమ్మిస్తు, తనను మోసగించి అంతా రాయించుకున్నారనీ వీలునామా ఒత్తిడిపెట్టి వ్రాయించారనీ, యెవరిమీదో దావా వేస్తానంటే, 'గెలవ్వు, ఓడిపోతావు, అడ్వకేట్లు బాగుపడతారు? అని నచ్చచెప్పాను, ఇంట్లో పెట్టెలో అంత డబ్బు యెక్కడిదీ, అని యెందుకు తెలుసుకోలేదు. తాను లేనప్పుడు అమ్మేశారా? అని ఆలోచించాలి. అంతేగాక, అలా అమ్మివుంటే ఆ డబ్బుతో చిన్న యిల్లు కొనుక్కొని, మిగిలిన డబ్బు వాడుకోవాలని అనుకుంటుండగా, పెరాలిసిస్ వచ్చి, చూపు మందగించి, చేయాలనుకున్నది చేయకుండానే పోయి వుండాలి' అని తెలియజెప్పాను ఓబయ్యకి. అదంతా టేప్‌రికార్డు చేయించాను. ఆ రికార్డు పార్సెల్ చేసి పంపాను. అందినట్టు రసీదు వచ్చింది. ఇంక నీ మీదికి దాడి జరగదు, వూరడింపుగా చూచాడు.

రక్షించారు గురువుగారూ! రాత్రల్లా నిద్రబట్టలేదు, వస్తా శాస్త్రీజీ! నమస్కారం, దిగులంతా పోయింది, చేత్తో తుడిచేశారు, కబ్బయ్య లేచాడు.

— o —